కథా నిలయం
5478
శ్రీకాకుళం

# ఎవరు కారణం?

ఆంధ్రభూమి మంత్లీ.. జూలై, 2002



"సార్..! మీరు చాలా అందంగా ఉంటారు!"

పేపరు దిద్దుతున్న రవీంద్ర ఆశ్చర్యంగా శ్రీలత వైపు చూసి, 'థాంక్స్' అని మళ్లీ తన పనిలో పడిపోయాడు.

"సార్..! నేను అందంగా ఉంటానా?"

మళ్లీ తలెత్తి చూసి, "నీకా అనుమానం ఎందుకొచ్చింది?" అన్నాడు.

"ముందు నా ప్రశ్నకి జవాబు చెప్పండి!"

"నీవు చాలా అందంగా ఉన్నావు. అందులో సందేహమే లేదు!"

"అయితే నన్ను ప్రేమిస్తారా?"

అసహనంగా శ్రీలత వైపు చూస్తూ– "ఎందుకు ప్రేమించను? నిన్ను ఓ శిష్యురాలిలా, సోదరిలా ఎప్పుడూ ప్రేమిస్తూనే వుంటాను..!"

"దయచేసి నన్ను సోదరిగా మాత్రం చూడకండి... ప్లీజ్!"

"ఎందుకు?"

"ఎందుకంటే... నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను కనుక!"

"కాని, నేను నిన్ను అలా చూడటం లేదు. నీకు అటువంటి అభిప్రాయం వచ్చేలా నేను ప్రవర్తించి ఉంటే నన్ను క్షమించు. నాకు పెళ్ళైంది. ఒక పాప కూడా! ఆ విషయం నీకూ తెలుసు. తెలిసీ ఇలా ప్రవర్తించడంలో అర్థంలేదు!"

"పెళ్ళైతే ఏమిటి? ఇంకెవరినీ ప్రేమించకూడదా?"

"కూడదు. సమాజం కూడా ఒప్పుకోదు!"

"నేను సమాజాన్ని గురించి పట్టించుకోను!"

"నేను పట్టించుకుంటాను. పైగా... రెండోపెళ్ళి చట్టపరంగా నేరం అవుతుంది. నా ఉద్యోగం పోతుంది!"

"మీ ఆవిడ మీపైనే కంప్లైంట్ చేస్తుందని నేను అనుకోను..!"

"చేయదు కానీ, నేను ఆమెకి అన్యాయం చెయ్యను. ఆమె అంటే నాకు ప్రాణం... ఆమె బాధపడటం నేను చూడలేను!"

"ఆ మనస్తత్వం చూసే నేను మిమ్మల్ని ప్రేమించింది! సార్... దయచేసి నా ప్రేమని కాదనకండి!" అర్థిస్తూ అంది శ్రీలత.

"నాకు కాలేజీకి టైమౌతోంది... ఇక నన్నొదిలెయ్యి! కానీ, నీవు ఇటువంటి అర్థంలేని ఆలోచనలు మానుకుంటే మనిద్దరికీ మంచిది!" అంటూ లేచాడు రవీంద్ర.

మౌనంగా పుస్తకాలు తీసుకొని వెళ్ళిపోయింది శ్రీలత.

ఆ తర్వాత శ్రీలత ప్రతిరోజూ ట్యూషను కాగానే– అతని అందం గురించీ, మంచితనం గురించీ పొగుడుతూ... తన ప్రేమ గురించీ, అతనంటే రోజురోజుకీ తనలో పెరుగుతున్న ఆరాధన గురించీ చెప్పసాగింది.

రానురాను శ్రీలత వ్యవహారం తలనొప్పిగా తయారైంది రవీంద్రకి.

ఆమె తల్లితండ్రులతో విషయం చెప్పి తమ కూతుర్ని నచ్చచెప్పో, మందలించో మంచిమార్గంలో పెట్టమని చెప్పడానికి వాళ్ళింటికి మూడుసార్లు వెళ్లాడు రవీంద్ర. అయితే– వెళ్లిన ప్రతిసారీ వాళ్ళు ఇంట్లో లేరని వాచ్‌మన్ చెప్పాడు. ఇటువంటి విషయాలు ఫోన్‌లో చెప్పడం బాగుండదని వాళ్ళకు ఫోన్ చేయలేదతడు.

ఒకసారి రవీంద్ర భార్య అమృత పుట్టింటికెళ్లింది.

ఆరోజు సాయంత్రం అయిదు గంటలకు తన ఇంటికి వచ్చిన శ్రీలతని చూసి ఆశ్చర్యపోయాడు రవీంద్ర.

"రా... కూర్చో! ఈరోజు ఆదివారం అని, ట్యూషను లేదని మరచిపోయావా?" అన్నాడు నవ్వుతూ.

"మిమ్మల్నే తలచుకుంటూ అన్నీ మరచిపోతున్నాను!"

"శ్రీలతా..! నేను చెబుతున్నది నీవు ఎందుకు అర్థంచేసుకోవు? నేను నా భార్యని తప్ప మరో అమ్మాయిని ప్రేమించను. నీకు ఇలాంటి ఆలోచన రావడం దురదృష్టం! ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ మనసు చదువుపై మళ్లించు!" అభ్యర్థనగా అన్నాడు రవీంద్ర.

"నాకు చదివి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. మా నాన్న సినిమాలు తీసి కోట్లు సంపాదించారు. ఆయన నా సుఖం కోసం, సంతోషం కోసం ఏమైనా చేస్తారు. ఎంతమంది మగవాళ్ళు భార్యతోపాటు మరోస్త్రీతో కాపురం చేయటం లేదు..? నేను కోరుకున్నకొద్దీ మీరు మరీ బెట్టు చూపిస్తున్నారు!"

"నీవు నన్ను ప్రేమిస్తున్నావు కాబట్టి- నేనూ నిన్ను ప్రేమించాలని శాసించడం అహంభావమే అవుతుంది. నీవు ఇంతచెప్పినా నాకింకా నువ్వు ఓ సోదరిలాగే కనిపిస్తున్నావు!"

"నేను నమ్మను. మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటున్నారు. నా అందాన్ని చూసినవారు నా ప్రేమకై పడిగాపులు పడుతుంటారు. నిజానికి మీకంటే అందగాళ్ళు దొరకక కాదు. ఎందుకో... నాకే తెలియకుండా మీరంటే ఇష్టం ఏర్పడింది. మరచిపోదామన్నా మరువలేకున్నాను."

"ఎలాగూ ఇంకో నెలలో పరీక్షలు అయిపోతాయి. ఎక్కడికైనా వెళ్లి కొద్దిరోజులుండి రా! అన్నీ సర్దుకుంటాయి!"

"నో... నాకు మీరు కావాలి. ఐ వాంట్ యూ!" అంటూ రవీంద్రని గట్టిగా కౌగలించుకొని ఏడవసాగింది.

ఒక్కక్షణం ఏంచేయాలో తోచలేదు రవీంద్రకి.

అతని సహనం నశించి ఆమెను దూరంగా త్రోశాడు-

"నీకు పట్టింది ప్రేమ కాదు... పిచ్చి! ఇంకెప్పుడూ నా ఇంటికి రావొద్దు! గెట్ లాస్ట్..!" అన్నాడు ఆవేశంగా.

కళ్ళనీళ్లతో అతనివైపు చూస్తూ- "మీరు మంచివారు అనుకున్నాను కాని, కఠినులు కూడా!" అంది.

"నువ్వు కాస్త ఆలోచించావంటే నేను కఠినుడినో, నీ మీద కన్సర్న్ ఉన్నవాణ్ణో తెలుస్తుంది. ఇక ఇంటికెళ్లు. ప్రొద్దుపోతోంది!" అన్నాడు రవీంద్ర.

ఆమె స్కూటీలో వెళ్లేంతవరకూ ఆమెనే చూస్తూ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

• • •

"ఏమండీ..! మనింటికి ఎవరో పోలీస్ ఇన్స్పెక్టరు వచ్చారు!" కంగారుగా భర్తతో అంది అమృత.

"డ్రాయింగ్ రూంలో కూర్చోబెట్టు!"

"కూర్చోబెట్టాను... మీరు వెళ్లండి!"

షర్టు తొడుక్కుని రూంలోకి ప్రవేశించాడు రవీంద్ర.

ఎదురుగా పోలీస్‌డ్రెస్‌లో ఓ వ్యక్తి కూర్చొనివున్నాడు. దాదాపు ముప్పై అయిదేళ్లు ఉండవచ్చు అతని వయసు.

"హలో... అయామ్ సాగర్! టూ టవున్ ఎస్.ఐ.ని!"

"గ్లాట్ టు మీట్ యు... అయామ్ రవీంద్ర!" కరచాలనం చేస్తూ అన్నాడు.

"కూర్చోండి! మీరు టౌన్లో ఉన్న మేథ్స్ లెక్చరర్లలో నెంబర్‌వన్ అని, మీ ట్యూషన్ల వల్ల వచ్చిన డబ్బుతోనే ఈ ఇల్లు కట్టారని విన్నాను!" అన్నాడు సాగర్.

"కొంపదీసి మీరు ఇన్‌కంటాక్స్‌వాళ్ళు పంపగా వచ్చినవాళ్ళు కాదుకదా..?!" నవ్వుతూ అన్నాడు రవీంద్ర.

"ట్యూషన్ల వల్ల నేను బాగా సంపాదించే మాట నిజమే! అయితే ఇల్లు పూర్తిగా వాటితో కట్టింది కాదు. స్టేట్‌బ్యాంక్‌లో లోను తీసుకొని కట్టాను!"

"మీరు పనిచేసేది సిద్ధార్థ కాలేజీలో కదూ..?"

"అవునండీ..! గత అయిదేళ్లనుంచీ అక్కడే చేస్తున్నాను!"

"ఐసీ..! మీ దగ్గర ట్యూషన్స్‌కి ఎంతమంది వస్తుంటారు?"

"దాదాపు అరవైమంది! రెండు బ్యాచ్‌లుగా చెప్తాను. ఉదయం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు లేడీస్ బ్యాచ్! సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు అబ్బాయిల బ్యాచ్!"

"ఇంతమంది కూర్చోవడానికి ఈ స్థలం సరిపోతుందా?"

"మేడపైన పెద్దగది ఉంది. అక్కడ చెప్తాను."

"మీ దగ్గర ట్యూషనుకి వచ్చే స్టూడెంట్స్‌లో ఎవరిపైన ఎక్కువ ఇంట్రస్టు చూపుతారు మీరు..?"

"అలా ఎవరూ లేరు. అందరినీ సమానంగానే చూస్తాను!"

"కానీ, సాధారణంగా కొంతమంది లెక్చరర్లు బాగా చదివే విద్యార్థులపై గాని, అందంగా ఉండే విద్యార్థినులపై గాని ఇష్టం చూపిస్తూ ఉంటారు. అలా మీరు ఇష్టం చూపించే అమ్మాయిలు ఎవరైనా ఉన్నారా?" రవీంద్రనే చూస్తూ అడిగాడు సాగర్.

కొంతసేపు ఆలోచించి చెప్పాడు-

"శ్రీలత అని ఒక అమ్మాయి ఉంది. చాలా తెలివైన అమ్మాయి. నా ట్యూషన్‌కి వచ్చేవాళ్ళలో స్టేటుర్యాంకు తెచ్చుకోగల సామర్థ్యం ఉన్న అమ్మాయి కావడంతో ఆమెపై ఇంకాస్త ఎక్కువ శ్రద్ధ చూపించేవాణ్ణి!"

"ఆ శ్రద్ధ ప్రేమగా మారి, పెళ్ళి వరకూ వచ్చి మీ భార్యకి చెప్పే ధైర్యం లేక, సంఘంలో ఉన్న మంచిపేరు పోగొట్టుకోవడం ఇష్టంలేక- ఆ అమ్మాయిని తిరస్కరించారు... అవునా?"

"ఛ... ఛ..! మీరు ఏవేవో ఊహించుకొని మాట్లాడుతున్నారు. మీరు అనుకొన్నదేదీ మా మధ్య జరగలేదు."

"జరిగిందని నేను ఖచ్చితంగా చెప్పగలను. అందుకు కావలసిన సాక్ష్యాలు నా దగ్గరున్నాయి!"

"సాక్ష్యాల వరకూ ఎందుకు? మీరు శ్రీలతను అడిగితే తనే నిజం చెబుతుంది!"

"అది ఈ జన్మలో జరుగదు."

"ఎందుకు జరుగదు?"

"శ్రీలత ఈరోజు ఉదయమే ఆత్మహత్య చేసుకుని మరణించింది కనుక!"

"మైగాడ్..!" షాక్ తిన్నట్లు అరిచాడు రవీంద్ర.

"కూల్‌డౌన్ మిస్టర్ రవీంద్రా..! కూల్‌డౌన్..!"

"శ్రీలత ఎంతపని చేసింది? అంత తెలివితేటలుండీ పెద్ద పొరపాటు చేసింది. పాపం... ఆమె తల్లిదండ్రులు ఎలా తట్టుకుంటున్నారో ఈ బాధని?!"

"కనీసం వాళ్ళకోసమైనా మీరు నిజం చెప్పండి! మీమధ్య ఏం జరిగింది? మీ తప్పు లేకపోతే మిమ్మల్ని రక్షించే పూచీ నాది!"

రవీంద్ర కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు.

అతను శ్రీలత మరణవార్త విన్న షాక్ నుంచి ఇంకా తేరుకోలేదని అర్థమైంది సాగర్‌కి.

తర్వాత జరిగినదంతా సాగర్‌కి చెప్పాడు రవీంద్ర.

అంతా విని–

"అయితే... మీరు చెప్పినదంతా నన్ను నమ్మమంటారు?!" అన్నాడు సాగర్.

"నేను కల్పించి చెబుతున్నానంటారా? కావాలంటే నా భార్యను పిలిచి అడగండి. మా మధ్య దాపరికాలు లేవు!"

"ప్రతిభార్యా తన భర్తను కాపాడాలనే ప్రయత్నిస్తుంది. అతడెంత దుర్మార్గుడైనా సరే..!"

"సరే... మీయిష్టం! ఇప్పుడు నన్నేం చేయమంటారు? పోలీస్‌స్టేషన్‌కి వచ్చి సరెండర్ అవమంటారా? పదండి వెళదాం. ఒక మంచి విద్యార్థిని నావల్ల తన జీవితాన్ని అంతం చేసుకుందన్న బాధ ఒకవైపు, మీ మాటల వల్ల కలిగే బాధ ఇంకోవైపు! జైలుశిక్ష ఇంతకంటే భయంకరంగా ఉండదు... పదండి!"

సాగర్ రవీంద్ర వైపు జాలిగా చూశాడు. తర్వాత–

"ఐ యామ్ సారీ రవీంద్రగారూ! నిజం రాబట్టాలనే ప్రయత్నంలో మేము కొంత కరకుగానే ప్రవర్తిస్తూంటాం. నేను మీరు చెప్పింది నమ్ముతున్నాను. నాకు శ్రీలత గదిలో ఒక ఉత్తరం దొరికింది. 'ప్రేమలో ఫెయిలయినందువల్ల ఆత్మహత్య చేసుకుంటున్నానని, వచ్చే జన్మలోనయినా రవీంద్ర భార్యగా పుట్టాలని కోరుకుంటున్నా'నని శ్రీలత వ్రాసింది!" అన్నాడు.

తల పట్టుకుని కూర్చున్నాడు రవీంద్ర.

"చూడండి రవీంద్రా..! ఆ ఉత్తరం విషయం ఇంకెవరికీ తెలియదు కనుక– దానిగురించి మరచిపోండి. కాని, శ్రీలత తండ్రి రాజారామారావు ప్రముఖ నిర్మాత, దర్శకుడు. రాజకీయంగా కూడా బాగా పలుకుబడి ఉన్నవాడు. శ్రీలత స్నేహితుల వల్ల జరిగింది తెలిస్తే మీ తప్పు లేకున్నా మిమ్మల్ని జైలుకి పంపడానికి ప్రయత్నిస్తాడు!" అన్నాడు సాగర్.

"నిజంగా జైలుశిక్షే వేయవలసి వస్తే మీరు ముందు అరెస్ట్ చేయవలసిన వ్యక్తి ఒకరున్నారు..."

"ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు సాగర్.

"దర్శకుడిగా తన నైతికబాధ్యత మరచి, యువత హృదయాల్ని కలుషితం చేసిన రాజారామారావు గారు!"

• • •

శ్రీలత మరణానికి సంతాపసూచకంగా కాలేజీలో సభ జరిగింది.

శ్రీలత తల్లిదండ్రులు, లెక్చరర్లు, విద్యార్థినీ విద్యార్థులు, పట్టణ ప్రముఖులు ఆ సభకి హాజరయ్యారు.

అందరూ శ్రీలత మంచితనం గురించి, తెలివితేటల గురించీ మాట్లాడారు.

రాజారామారావు లేచి మైకు దగ్గరికి రాగానే, అందరూ నిశ్శబ్దంగా ఆయననే చూడసాగారు.

"నా ఆశాజ్యోతి ఆరిపోయింది. నా బిడ్డ నన్ను అన్యాయం చేసి వెళ్లిపోయింది..." అంటూ భోరున విలపించాడు.

తర్వాత తేరుకొని-

"ప్రేమలో విఫలమవ్వడం వల్లే నా బిడ్డ ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. ఆమె సుఖం గురించే తపించే నేను- ఆమె ఎవరిని ప్రేమించినా వద్దనేవాణ్ణి కాను. ఆ విషయం శ్రీలతకీ తెలుసు. మరి, ఎందుకు పిరికితనంగా ఆలోచించిందో నాకర్థం కావడంలేదు. ఆమె ప్రేమించినవ్యక్తి మీలో ఉంటే ధైర్యంగా ముందుకివచ్చి శ్రీలత ఎందుకు ఆత్మహత్య చేసుకుందో చెప్పండి. అతనిపై ఏ చర్యా తీసుకోను. కాని, నిజం తెలుసుకోవలసిన బాధ్యత నాకుంది... ప్లీజ్!" అంటూ చేతులు జోడించాడు.

అందరూ మైకు వైపు వస్తున్న రవీంద్రని ఆశ్చర్యంగా చూడసాగారు. లెక్చరర్‌గా, సంస్కారం ఉన్నవ్యక్తిగా మంచిపేరున్న రవీంద్ర- శ్రీలత ప్రేమికుడవడం వాళ్ళను విస్మయపరచింది.

"నా పేరు రవీంద్ర! ఈ కాలేజీలో మాథ్స్ లెక్చరర్ని!

నన్ను శ్రీలత ప్రేమించింది. కాని, నేను శ్రీలతను ప్రేమించలేదు. శ్రీలతను స్టేట్‌ర్యాంకర్ చేయడానికి కావలసిన స్ఫూర్తిని, సహాయాన్ని అందజేయసాగాను. అయితే దురదృష్టవశాత్తూ శ్రీలత నాలో ఓ శ్రేయోభిలాషిని చూడలేకపోయింది. తను ప్రేమవిషయం నాతో చెప్తే ఆశ్చర్యపోయాను. అలా ఆలోచించడం తప్పని మందలించాను. ఎందుకంటే... నేను బాధ్యతగల లెక్చరర్ని!

నేను అమితంగా ప్రేమించే భార్యా, కూతురు నాకు ఉన్నారు. నా సంసారం నాకొక అద్భుత ప్రపంచం! మరో ఆడదాని ప్రేమకోసమో, పొందుకోసమో ఈ స్వర్గాన్ని చేజేతులా నాశనం చేసుకునే తెలివితక్కువతనం నాకు లేదు.

శ్రీలత మరణానికి ఒకవిధంగా ఆమె తండ్రి రాజారామారావుగారే కారణం! ఆయన ఎన్నో విజయవంతమైన సినిమాలు తీసిన నిర్మాత, దర్శకుడు. కాని, ఒక నిర్మాతకు గాని, దర్శకునికి గాని, రచయితకు గాని సంఘంలో నైతిక బాధ్యత ఉంది. తమ చిత్రాల ద్వారా, రచనల ద్వారా నీతిని బోధించాలి తప్ప- అనైతికాన్ని బోధించకూడదు.

మంచిని చెప్పకపోయినా ఫర్వాలేదు కాని, చెడును మాత్రం చెప్పకూడదు. లెక్చరర్ని స్టూడెంట్ ప్రేమించడం, పెళ్ళైనవాడు మరోస్త్రీతో ప్రేమలు సాగించడం, రెండు పెళ్ళిళ్ళు చేసుకోవడం... దాన్ని అందరూ ఆమోదించడం, శిష్యురాలు తన లెక్చరర్ని పెళ్ళిచేసుకుంటానని అతనితో ఛాలెంజ్ చేయడం, హీరోయిన్- హీరో వెంటబడుతూ అతన్ని రెచ్చగొట్టడం... ఇలాంటి సన్నివేశాలన్నీ ఆయన సినిమాల్లో పుష్కలంగా ఉంటాయి.

మన పాతసినిమాల్లో హీరోని త్రాగుబోతుగానో, తిరుగుబోతుగానో, దొంగగానో చూపిస్తే- చివరలో అతను మారినట్లు, తన తప్పు తెలుసుకున్నట్లు చూపించేవారు.

కాని, రాజారామారావుగారి సినిమాల్లో ప్రతి చట్టవ్యతిరేక పనినీ లీగలైజ్ చేసినట్లు, న్యాయమేనన్నట్లు చూపించారు. హీరో పోలీసుల్ని కొట్టడం, లెక్చరర్‌తో స్టూడెంట్స్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడటం... ఇవన్నీ ప్రజలపై, ముఖ్యంగా యువతరంపై చెడుప్రభావం చూపిస్తాయి.

స్త్రీకి సిగ్గే సింగారం- బిడియమే అభరణం- అమాయకత్వమే అందం! స్త్రీ పాత్రలతో చౌకబారు చేష్టలు చేయించడం ఎంతవరకు న్యాయం? పాతసినిమాల్లో వేశ్యల్ని కూడా ఉదాత్తంగా చూపించేవారు కదా!

ఇక, శ్రీలత విషయానికి వస్తే-

ఆమె తన తండ్రి సినిమాల్లోవలె జీవితంలో కూడా కొన్ని అసంభవాల్ని సంభవాలు అనుకుంది. పైగా... తండ్రే ఇద్దరు భార్యల సినిమాలు ఎన్నో తీసి ఉండటంతో ఆయన మద్దతు తనకుందని భావించింది. నేను ఆమె ఆలోచన తప్పని చెప్పడంతో- తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది.

శ్రీలత మరణానికి ఒక లెక్చరర్‌గా నేను ఎంతో బాధపడుతున్నాను. నా ప్రమేయం లేకుండానే నేను కారణం అవడం నాకు మరింత బాధగా ఉంది. రాజారామారావులాంటి నిర్మాతలు తమ నైతిక బాధ్యతను మరచిపోకుండా సినిమాలు తీస్తే ఎందరో అమ్మాయిల్ని దారితప్పకుండా ఆపగలరనీ, ఆయన కూతుర్లాంటి మరెందరో అమ్మాయిల్ని బ్రతికించగలరనీ నేను నమ్ముతున్నాను. నాకంటే వయసులో ఎంతో పెద్దవారైన రాజారామారావుగారిని నా మాటల్లో తప్పు ఉంటే మన్నించమని ప్రార్థిస్తున్నాను."

సభ చప్పట్లతో నిండిపోయింది.

అక్కడున్న ప్రతి ఒక్కరూ మనసులోనే రవీంద్ర అభిప్రాయంతో ఏకీభవించారు.

రాజారామారావు లేచి-

"చిన్నవాడైనా చక్కగా చెప్పారు రవీంద్ర! ఆయన్ని నేను మన్నించడం కాదు... నా బిడ్డవల్ల ఇంత వ్యధను అనుభవించిన అతనికి నేనే సారీ చెప్పాలి! ఇకపై నేను యువతరం మనసుల్ని కల్తీ చేసేలా చిత్రాలు నిర్మించనని హామీ యిస్తున్నాను!" అన్నాడు.

సభ ముగిసిన తర్వాత సాగర్ రవీంద్రకి షేక్‌హ్యాండ్ ఇస్తూ- "చాలా బాగా చెప్పారు! మీ ధైర్యం మెచ్చుకోదగ్గది!" అన్నాడు.

"నేను మీతో చెప్పింది సభాముఖంగా చెప్పమని సలహా ఇచ్చింది మీరు! కాబట్టి రాజారామారావులో మార్పుకు కారణం మీరే!"

"ఆయన సరిగ్గా అర్థంచేసుకోవడం మన అదృష్టం! మన ప్రయత్నంవల్ల కొంతమంది అమ్మాయిలైనా శ్రీలతలు కాకుండా ఉంటే చాలు!" అన్నాడు సాగర్ ఆశాభావంతో.